క్లుప్తంగా

సైబర్ నేరస్తులతో జాగ్రత్త!

ఎల్లారెడ్డి/కామారెడ్డి క్రైం: సైబర్ నేరస్తులతో జాగ్రత్తగా ఉండాలని ఎల్లారెడ్డి ఎస్సై మహేష్, దేవునిపల్లి ఎస్సై రాజు వేర్వేరుగా ప్రజలకు సూచించారు. రైతుల రుణమాఫీ కావడంతో సైబర్ నేరస్తులు 'ఏపీకే' ఫైల్స్ పేరిట రైతుల రుణం మాఫీ అయ్యిందని వాట్సప్ ద్వారా మెసేజ్‌లు పంపుతున్నారని, వాటిని ఎవరూ కూడా ఓపెన్ చేయవద్దని సూచించారు. బ్యాంకు అధికారులమని మెసేజ్‌లు చేస్తున్నారని, ఎలాంటి సమాచారం నమ్మవద్దని అన్నారు. ఎవరైనా మోసపోతే వెంటనే 1930 నెంబర్‌కు ఫోన్ చేయాలని అన్నారు.

ఉచిత వైద్య శిబిరం



దోమకొండ: దోమకొండ కోట గ్రామ అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో గురువారం ఉచిత మెగా ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఆనంద్ భవనలో కార్డియాలజిస్ట్ సలీం, వైద్యులు నిషిత, నిహారికలు ఉచితంగా వైద్య సేవలు నిర్వహించి వృద్ధులు, వికలాంగులకు కావలసిన మందులను పంపిణీ చేశారు. 187 మంది రోగులు క్యాంపులో పాల్గొన్నారు. ప్రతి నెలా 18న ఉచితవైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు ఈ సందర్భంగా నిర్వాహకులు తెలిపారు. గడి కోట ట్రస్ట్ సీనియర్ మేనేజర్ బాబ్జి, ప్రతినిధులు గణేష్, రాజశేఖర్ ఉన్నారు.

అవయవ దానానికి ముందుకు వచ్చిన దంపతులు



భిక్కనూరు: తాము తనువు చాలించిన తర్వాత తమ శరీర అవయవాలు మట్టిలో కలిసిపోకుండా ఉండేందుకు ఒక జంట తమ అవయవాలను దానం చేసేందుకు ముందుకు వచ్చి తన పేర్లను రిజిస్ట్రేషన్ చేసుకున్న ఘటన గురువారం జరిగింది. కాచాపూర్ గ్రామానికి చెందిన ముదాం శ్రీధర్- ముత్యాల చంద్రకళ దంపతులు కామారెడ్డిలోని వివేకానంద పాఠశాలలో ఉపాధ్యాయులుగా పనిచేస్తున్నారు. వీరు తమ మరణాంతరం శరీరంలోని అవయవాలను అవసరమైన వారికి దానం చేసేందుకు ముందుకు వచ్చి కేంద్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖలో ఆర్గాన్ డోనేషన్‌కు దరఖాస్తు చేసుకుని తమ పేర్లను నమోదు చేయించుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తమ మరణం అనంతరం తమ అవయవాలను అవసరమైన వారికి ఉపయోగపడటం తమకు ఎంతో సంతృప్తి నిస్తుందన్నారు.

అవయవదానం చేసిన కుటుంబానికి ఆర్థికసాయం



భిక్కనూరు: అవయవదానం చేసిన పెద్దమల్లారెడ్డి గ్రామంలోని మెట్టు ప్రవీణ్ కుటుంబానికి మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్ గురువారం ఆర్థిక సాయం పంపించారు. గ్రామ బీఆర్ఎస్ నేతల ద్వారా ప్రవీణ్ కుటుంబానికి రూ.10 వేలను అందించారు.

వలస కూలీలకు నిత్యావసర వస్తువుల పంపిణీ



భిక్కనూరు: కాచాపూర్‌లో నివసిస్తున్న వలస కూలీలకు గ్రామానికి చెందిన పూస నర్సింగ్ తన పుట్టిన రోజు సందర్భంగా గురువారం నిత్యావసర సరుకులను అందజేశారు. గ్రామంలో ఉన్న పది వలస కూలీల కుటుంబీకులకు రూ.15వేల విలువ చేసే నిత్యావసర సరుకులతో పాటు బియ్యంను పంపిణీ చేశారు. అనిల్‌కుమార్, జోగు శివరాజు, బుర్రిగారి నర్సింలు, తమ్మల సిద్దరాములు, పూస శంకర్, మెట్టు సందీప్, తదితరులున్నారు.

ప్రీస్కూల్ ధ్రువపత్రాలు..



నిజాంసాగర్(జుక్కల్): మండలంలోని అచ్చంపేట అంగన్‌వాడి కేంద్రంలో గురువారం చిన్నారులకు ప్రీస్కూల్ ధ్రువపత్రాలను సూపర్‌వైజర్ లక్ష్మి అందజేశారు. అమ్మ మాట- అంగన్‌వాడి బాట కార్యక్రమంలో భాగంగా అంగన్‌వాడి కేంద్రంలో చిన్నారుల తల్లిదండ్రులతో సమావేశం ఏర్పాటు చేశారు. ప్రీస్కూల్ పూర్తయిన పిల్లలకు ధ్రువపత్రాలను పంపిణీ చేశారు. అంగన్‌వాడి టీచర్లు రోజా, విజయకుమారి, నాగమణి, రమాదేవి, ఆరోగ్య కార్యకర్త సునీత, ఆశావర్కర్ నాగమణి, కమల తదితరులున్నారు.

విజృంభిస్తున్న జ్వరాలు

- ప్రభుత్వ ఆస్పత్రిలో 350కి పెరిగిన ఔట్ పేషంట్లు
- కిక్కిరిసిపోతున్న ఆస్పత్రులు



ఎల్లారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చిన రోగులు



ఎల్లారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రిలో వైరల్ ఫీవర్‌తో చికిత్స పొందుతున్న బాధితులు

ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): వైరల్ ఫీవర్లతో ఎల్లారెడ్డిలోని ఆస్పత్రులు కిక్కిరిసి పోతున్నాయి. వాతావరణంలో మార్పుల కారణంగా చిన్నారులతో పాటు పెద్దలు సైతం వైరల్ ఫీవర్ బారిన పడి ఇబ్బందులు పాలవుతున్నారు. డెంగీ, మలేరియా, టైఫాయిడ్ తదితర జ్వరాల కారణంగా ఆస్పత్రిలోని వార్డులు రోగులతో నిండి పోతున్నాయి. పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో గత నెలలో ఓపీ పేషెంట్ల సంఖ్య వంద మంది కూడా దాటలేదు. వారం రోజులుగా 350 మంది పైబడి ఓపీ పేషెంట్లు వచ్చారు. వీరిలో 30 శాతం వరకు ఆస్పత్రిలో చేరి చికిత్స పొందుతున్నారు. ప్రభుత్వ ఆస్పత్రిలో ఉచితంగా వైద్యం అందుతున్నప్పటికి చాలా మంది ప్రైవేటు ఆస్పత్రులలో చేరి వైద్యం పొందుతుండడంతో జేబులు గుల్లవుతున్నాయి.

పరిసరాల పరిశుభ్రత లేకపోవడంతోనే..

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోకపోవడంతో పాటు, దోమలు కుట్టకుండా జాగ్రత్తలు తీసుకోకపోవడం, బయట ఆహారం సేవించడం వల్ల జ్వరాల బారిన పడే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని వైద్యులు సూచిస్తున్నారు. కలుషితమైన నీటిని తాగడం వలన ఎక్కువగా వాంతులు, విరోచనాలు అవుతాయని అన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు, ఈగలు, దోమలు లేకుండా తగిన చర్యలు తీసుకోవాలని, పోషకాహారం, పండ్లు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు.

జ్వరంతో ఆస్పత్రిలో చేరా

జ్వరంతో ఇబ్బందిగా ఉండడంతో ఆస్పత్రికి వచ్చాను. నీరసంగా ఉండడంతో ఆస్పత్రిలో చేరాను. రెండు రోజులుగా వైద్యం పొందుతున్నాను. కొంచెం తక్కువగా ఉంది. జ్వరం తగ్గగానే పంపుతామని వైద్య సిబ్బంది తెలిపారు.

– పీరి, బొల్లారం

కాచి చల్లార్చిన నీటిని తాగాలి

ఎల్లారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులతో వార్డులు కిటకిటలాడుతున్నాయి. రోజూ సాధారణంగా వంద మంది వచ్చే ఓపీ పేషెంట్లు 350కి చేరింది. సాధారణ జ్వరాలు మాత్రమే ఉన్నాయి. డెంగీ, మలేరియా, టైఫాయిడ్ కేసులు నమోదు కాలేదు. రోగులతో పాటు సాధారణ ప్రజలు వైరల్ ఫీవర్ సోకకుండా కాచి చల్లార్చిన నీటిని తాగడంతో పాటు ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి.

– డాక్టర్ రవీంద్రమోహన్, సూపరింటెండెంట్, ప్రభుత్వ ఆస్పత్రి, ఎల్లారెడ్డి

రుణమాఫీ సంబురాలు



పిట్లంలో సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న రైతులు, కాంగ్రెస్ నేతలు



బోర్లంలో..



నాగిరెడ్డిపేటలో..



తాడ్వాయిలో..



ఇసన్నపల్లిలో..

సాక్షి నెట్‌వర్క్: కాంగ్రెస్ ప్రభుత్వం అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఇచ్చిన మాట ప్రకారం రైతులకు పంట రుణమాఫీ చేయడంతో గురువారం జిల్లా వ్యాప్తంగా కాంగ్రెస్ నాయకులు సంబురాలు చేసుకున్నారు. టపాసులు కాల్చి తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు. అనంతరం స్వీట్లు పంపిణీ చేపట్టారు. సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటాలకు రైతులతో కలిసి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నేతలు మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన మాట తప్పదని, రుణ మాఫీ చేసి రైతులకు అండగా నిలిచిందన్నారు.



గర్గుల్‌లో..



బీబీపేటలో..



రాజంపేటలో..



మాచారెడ్డి మండలం గజ్యానాయక్ తండాలో..



నస్రుల్లాబాద్‌లో క్షీరాభిషేకం చేస్తున్న పోచారం వర్గం కాంగ్రెస్ నేతలు



నస్రుల్లాబాద్: ఏనుగు రవీందర్ రెడ్డి వర్గం కాంగ్రెస్ నేతలు

ప్రత్యక్ష ప్రసారాన్ని వీక్షించిన రైతులు



లింగంపేట రైతు వేదికలో సీఎం ప్రసంగాన్ని వీక్షిస్తున్న రైతులు



అడ్లూర్ ఎల్లారెడ్డిలో..



బీబీపేటలో..



రాజంపేటలో..



గాంధారి మండలం పోతంగల్‌లో..

సాక్షి నెట్‌వర్క్: ఎన్నికల ప్రచారంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ మేరకు సీఎం రేవంత్ రెడ్డి గురువారం రైతులకు రూ.2 లక్షల పంట రుణాల మాఫీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమాన్ని వీక్షించేందుకు రైతు వేదిక భవనాల్లో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఏర్పాట్లు చేశారు. జిల్లా పరిధిలోని నాయకులు, రైతులు, వివిధ శాఖల అధికారులు హాజరయ్యారు. సీఎం రైతులనుద్దేశించి మాట్లాడారు. గురువారం రూ.లక్ష వరకు ఉన్న పంట రుణాలను మాఫీ చేశారు.



భిక్కనూరులో..



పెద్దకొడప్‌గల్‌లో..

రూ.18 వేల వేతనం ఇవ్వాలి



ఎల్లారెడ్డి: నెలకు రూ.18 వేల వేతనం కల్పించాలని కోరుతూ ఆశావర్కర్లు గురువారం ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావుకు వినతిపత్రం అందించారు. అలాగే 20 రోజుల పాటు వేతనంతో కూడిన సెలవు ఇవ్వాలని, రిటైర్‌మెంట్ బెనిఫిట్ ఇవ్వాలని వారు వినతిపత్రంలో పేర్కొన్నారు. ఆశావర్కర్లు సంధ్య, సవిత తదితరులున్నారు.

చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాలలో చేర్పించాలి



ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాలలో చేర్పించాలని అంగన్‌వాడీ టీచర్లు అన్నారు. గురువారం ఎల్లారెడ్డిలో చిన్నారులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. అమ్మమాట- అంగన్‌వాడి బాట కార్యక్రమంలో భాగంగా ర్యాలీ తీశారు. ఈ కార్యక్రమం ఈనెల 20 వరకు కొనసాగుతుందని, దీనిలో భాగంగా చిన్నారుల ఇంటింటికి తిరిగి వారిని అంగన్‌వాడి కేంద్రాలలో చేరేలా తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్నట్లు అంగన్‌వాడి టీచర్లు తెలిపారు.

భారీ వర్షానికి కూలిన కటౌట్లు



బాన్సువాడ రూరల్: బాన్సువాడలో గురువారం భారీ వర్షం పడింది. సాయంత్రం 5 గంటల నుంచి ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షానికి జన జీవనం అస్తవ్యస్తమైంది. రుణ మాఫీ సంబురాలతో పాటు ఇటీవల ఆగ్రోస్ కార్పొరేషన్ చైర్మన్ కాసుల బాలరాజును బాన్సువాడకు ఆహ్వానిస్తూ కొయ్యగుట్ట వద్ద ఏర్పాటు చేసిన భారీ కటౌట్లు, ఫ్లెక్సీలు కూలి పోయాయి. దీంతో రహదారిపై రాకపోకలకు అంతరాయం కలిగింది.

సమస్యలపై ఐక్యంగా పోరాడాలి



రామారెడ్డి: ఉపాధ్యాయుల సమస్యలపై పీఆర్‌టీయూ ఐక్యంగా పోరాడి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తోందని రామారెడ్డి పీఆర్‌టీయూ మండల అధ్యక్షుడు బాలకృష్ణ అన్నారు. గురువారం రామారెడ్డిలో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉపాధ్యాయులు సంఘటితంగా ఉండి ఉపాధ్యాయ సమస్యలపై ఐక్యంగా పోరాడాలని నేతలు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రామారెడ్డి మండల ప్రధాన కార్యదర్శి రాజు, రాష్ట్ర బాధ్యులు శ్రీనివాస్, సతీష్, ఖలీముద్దీన్, గోపాల్ రావు, కృష్ణమోహన్, భూమేష్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

మాట నిలబెట్టుకున్న సీఎం



నస్రుల్లాబాద్(బాన్సువాడ): సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నారని డీసీసీబీ మాజీ చైర్మన్ పోచారం భాస్కర్ రెడ్డి అన్నారు. గురువారం దుర్కి రైతు వేదికలో జరిగిన రుణ మాఫీ సంబురాల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రుణ మాఫీలో భాగంగా రూ.లక్షలోపు రుణం ఉన్న రైతులు మొదటి విడతలో మాఫీ చేశారన్నారు. అనంతరం ఆయన చిత్ర పటానికి పాలాభిషేకం చేశారు. మాజీ ఎంపీపీ పాల్త్య విఠల్, మాజి సర్పంచ్ శ్యామల పాల్గొన్నారు.

ముదిరాజులను బీసీ-ఏ గ్రూపులోకి మార్చాలి



మాట్లాడుతున్న ముదిరాజు సంఘం నేతలు

భిక్కనూరు: ముదిరాజులను బీసీ-డి నుంచి బీసీ-ఏ గ్రూపులోకి మార్చాలని డిమాండ్ చేస్తూ ఆందోళన కార్యక్రమాలను నిర్వహించేందుకు ప్రణాళికలను రూపొందిస్తున్నట్లు ముదిరాజు సంఘం జిల్లా అధ్యక్షుడు గజ్జెల భిక్షపతి, రాష్ట్ర సంఘం ప్రతినిధి పున్న రాజేశ్వర్‌లు అన్నారు. గురువారం భిక్కనూరులో వారు మాట్లాడారు. సీఎం రేవంత్ రెడ్డి ముదిరాజుల అభివృద్ధి కోసం ముదిరాజు కో-ఆపరేటివ్ సొసైటీని ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించినందున కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. ముదిరాజులకు అన్ని చెరువులు, కుంటల్లో చేపలు పట్టుకునేందుకు హక్కులు కల్పించాలని డిమాండ్ చేశారు. ముదిరాజుల హక్కుల పరిరక్షణకు భిక్కనూరు తహసీల్ కార్యాలయం ముందు శుక్రవారం ఉదయం 11 గంటలకు ధర్నా కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. ముదిరాజు సంఘం మండలాధ్యక్షుడు బండి రాములు, నేతలు గంగళ్ల భూమయ్య,డాక్టర్ సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

జయంతి వేడుకల వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ



వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న కాంగ్రెస్ నేతలు

బాన్సువాడ: ఈ నెల 31న నిర్వహించే రాంరామ్ మహరాజ్ జయంతి వేడుకలకు సంబంధించిన వాల్‌పోస్టర్లను గురువారం బాన్సువాడ బంజార భవనంలో కాంగ్రెస్ పార్టీ ఎస్టీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రతాప్‌సింగ్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఎస్టీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు నరేష్ రాథోడ్ మాట్లాడుతూ.. గిరిజనుల ఆరాధ్య దైవం రాంరామ్ మహరాజ్ జయంతి వేడుకలను ఈ నెల 21న గురుపౌర్ణమి సందర్భంగా ప్రతి తండాలో జరుపుకోవాలని కోరారు. ఈ నెల 31న మాజీ ఎమ్మెల్సీ రాములు నాయక్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో జయంతి ఉత్సవాలు నిర్వహిస్తామని అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి హాజరవుతున్నారని చెప్పారు. నాయకులు చందర్‌నాయక్, అంబర్‌సింగ్, రవి, తార్య, తదితరులున్నారు.

మొక్కల సంరక్షణకు కృషి చేయాలి



మొక్కలు నాటుతున్న ఎక్సైజ్ సీఐ మధుసూదన్



తాండూర్‌లో మొక్కలను పరిశీలిస్తున్న ఎంపీడీవో

దోమకొండ/బీబీపేట: మొక్కలను నాటి వాటిని సంరక్షించాలని దోమకొండ ఎక్సైజ్ సీఐ మధుసూదన్ రావ్ అన్నారు. గురువారం ఎక్సైజ్ శాఖ పరిధిలోని దోమకొండ మండలం ముత్యంపేట, బీబీపేట మండలంలోని మాందాపూర్, ఇస్సానగర్ గ్రామాల్లో వన మహోత్సవం సందర్భంగా మొక్కలను నాటారు. అనంతరం డ్రగ్స్‌పై వారికి అవగాహన కల్పించారు. ఆయా గ్రామాల గౌడసంఘం ప్రతినిధులు సిద్దాగౌడ్, నాగరాజ్‌గౌడ్, రామాగౌడ్, లక్ష్మీనారాయణగౌడ్, ఎక్సైజ్ సిబ్బంది శ్రీనివాస్, నవీన్‌రెడ్డి, బాల్‌రాజ్, చింటు, జీవన్, మోహిన్, వహిద్ తదితరులున్నారు.

హరితవనాల పరిశీలన

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): వనమహోత్సవంలో భాగంగా నాటిన మొక్కలను సంరక్షించేలా చర్యలు చేపట్టాలని నాగిరెడ్డిపేట ఎంపీడీవో పర్భన్న సూచించారు. తాండూర్ జీపీ పరిధిలో గల హరిత వానాలను గురువారం ఆయన పరిశీలించారు. ప్రస్తుతం నాటుతున్న మొక్కల చుట్టూ గుంతలు తీయించాలని చెప్పారు. వనమహోత్సవంలో భాగంగా నాటిన మొక్కలు ఎండిపోకుండా చర్యలు చేపట్టాలన్నారు. ఆయనవెంట ఈసీ సాయిలు, టీఏ సంతోష్, ఫీల్డ్‌అసిస్టెంట్ శ్రీనివాస్ ఉన్నారు.

విద్యార్థులకు టై, బెల్టుల పంపిణీ

సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండలంలోని ధర్మారావ్‌పేట్ ఉన్నత పాఠశాలలో గురువారం విద్యార్థులకు టై, బెల్టులు, ఐడెంటీ కార్డులను ఎంఈవో యోసెఫ్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ మంగలి బల్‌రాం, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సంజీవ్, మౌనిక, ఎస్ఎంసీ సభ్యులు రామాంజనేయులు, మధు కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



ఆధ్యాత్మికం

ఆస్పత్రిలో ఎల్లమ్మ బోనాల పండుగ



బాన్సువాడ: బాన్సువాడ మాత శిశు సంరక్షణ ఆస్పత్రి ఆవరణలో గురువారం బోనాల పండగ ఘనంగా నిర్వహించారు. ప్రతి ఏడాది ఆషాఢ మాసంలో ఆస్పత్రి సిబ్బంది ఆధ్వర్యంలో ఎల్లమ్మ బోనాల పండగను నిర్వహిస్తారు. ఎల్లమ్మకు ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి, రాష్ట్ర ఆగ్రో ఇండస్ట్రీస్ చైర్మన్ కాసుల బాల్‌రాజ్‌లు బోనాలు సమర్పించారు. కార్యక్రమంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ శ్రీనివాస్‌ప్రసాద్, వైద్య సిబ్బంది ఉన్నారు.

కొనసాగుతున్న నిత్యభజనలు



సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని కాశీ విశ్వేశ్వర స్వామి, విఠలేశ్వర స్వామి ఆలయాల్లో నిర్వహిస్తున్న నిత్య భజన కార్యక్రమం కొనసాగుతోంది. వర్షాలు సమృద్ధిగా కురువాలని గర్భాలయంలో జలాభిషేకాలు నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ రాజయ్య, మాజీ చైర్మన్ నర్సారెడ్డి, వేద బ్రాహ్మణుడు సంతోష్‌కృష్ణ శర్మ, ఆలయ కమిటీ, భజన మండలి సభ్యులు పాల్గొన్నారు.

ముగిసిన ఏకాదశి ఉత్సవాలు



ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): ఎల్లారెడ్డి పట్టణంలోని విఠలేశ్వరుడి ఆలయంలో గురువారం ఏకాదశి ఉత్సవాలు ముగిసినట్లు ఆలయ ధర్మకర్త వంగపల్లి నాగభూషణం తెలిపారు. ఆషాఢ ఏకాదశి ఉత్సవాలలో భాగంగా పట్టణంలోని విఠలేశ్వరుడి ఆలయంలో రుక్మిణి- పాండురంగ విగ్రహాలకు ప్రత్యేకంగా పూజలు అభిషేకాలని నిర్వహించామన్నారు. అన్నదాన కార్యక్రమం నిర్వహించినట్లు భక్తులు తెలిపారు.

హనుమాన్ ఆలయంలో హరినామ సంకీర్తనలు



బాన్సువాడ: పట్టణంలోని పాత బాన్సువాడ హనుమాన్ ఆలయంలో గురువారం హరినామ సంకీర్తనలు నిర్వహించారు. హనుమాన్ ఆలయంలో ప్రత్యేక పూజలు చేసిన భక్తులు ఉట్టి కొట్టడం, గోపాల కాలువలు, అభిషేకాలు, ప్రసాద వితరణ, భజన కార్యక్రమాలు చేశారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు అంజిరెడ్డి, కోశాధికారి ఉమ మహేష్, వార్కారీలు గొల్ల గంగారం, మొనప్ప, తదితరులున్నారు.